
సాక్షి
వికారాబాద్

మంగళవారం । 9 । మే । 2023



గదిలో బంధించి.. బెల్టుతో కొట్టి

తీసుకున్న అప్పు చెల్లించలేదని ఓ కార్మికుడిని యజమాని గదిలో బంధించి బెల్టుతో కొట్టిన ఘటన సోమవారం వెలుగుచూసింది. 8లో▸



చదువొక్కటే జీవితం కాదు

తమ కొడుకు.. కూతురు.. బాగా చదవాలి. ఉన్నత శిఖరాలకు ఎదగాలని తల్లిదండ్రులు ఆశ పడటంలో తప్పులేదు. 8లో▸



వంతెన సమస్య తీరేనా?

వికారాబాద్‌లో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు కవి సమ్మేళనం

అనంతగిరి: వికారాబాద్ పరిధిలోని అనంత గిరి గుట్టలో బుధవారం అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రారంభోత్సవం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహిత్య సాంస్కృతిక వేదిక జిల్లా ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కాళోజీ అవార్డు గ్రహీత ఏ వేణుగోపాల్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ముఖ్యఅతిథిగా సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు జీ గౌరీశంకర్, గౌరవ అతిథిగా సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య, ఆత్మీయ అతిథులుగా ఓయూ పూర్వ అధ్యాపకులు బాగయ్య, కవి, వ్యాపారవేత్త నర్సింలు గుప్తా హాజరు కానున్నట్లు తెలిపారు. కవులు, సాహితీ ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

చెక్‌పోస్ట్ వద్ద భద్రత కట్టుదిట్టం



కోట్లాపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: మండలంలోని తెలంగాణ – కర్ణాటక సరిహద్దు, కోట్లాపూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈ నెల 10న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం, డబ్బు రవాణా జరగకుండా భద్రత ఏర్పాటు చేశారు. కర్ణాటకకు వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అదేవిధంగా కర్ణాటక నుంచి వరి ధాన్యం తెలంగాణలోకి రాకుండా లారీలను తనిఖీ చేస్తున్నారు.

మాక్ డ్రిల్



రైల్వేస్టేషన్‌లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాల తనిఖీలు

తాండూరు టౌన్: పట్టణంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సోమవారం బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రార్థన మందిరాల సమీపంలో, జన సంచారం గల ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదని ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని పుట్టపహడ్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ. 50వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన వ ట్లాడుతూ..ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్‌ఎస్ మండలఅధ్యక్షుడు శేరిరాంరెడ్డి,రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు,ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్

పరిగి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ అన్నారు. సోమవారం పరిగి, దోమ మండలాలకు చెందిన కాంగ్రెస్ నేతలు నగరంలో జరిగిన యువ సంఘర్షణ సభకు వెళ్లారు. అంతకు ముందు పరిగిలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పరశురాంరెడ్డి, దోమ మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు అశోక్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, జనం

కాంగ్రెస్‌లో జోష్

'యువ సంఘర్షణ సభ'కు భారీగా యువత

- ఉత్తేజపరిచిన ప్రియాంక ప్రసంగం
- నినాదాలతో హోరెత్తించిన కార్యకర్తలు
- సందడిగా మారిన సరూర్‌నగర్ స్టేడియం పరిసరాలు



ప్రియాంకగాంధీకి నమస్కరిస్తున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నిరుద్యోగ యువతకు భరోసా కల్పించేందుకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నిర్వహించిన 'యువ సంఘర్షణ సభ' గ్రేటర్ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. కర్ణాటకలో ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. అప్పటికే ఎల్బీనగర్ చౌరస్తాలోని తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి ర్యాలీగా వేదిక పైకి చేరుకున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహా.. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తదితరులు ప్రియాంకకు ఘన స్వాగతం పలికారు.

అభివాదం చేస్తూ...అమరులను స్మరిస్తూ

సాయంత్రం 5.25 గంటలకు కార్యకర్తలకు అభివాదం చేస్తూ ప్రియాంక ప్రధాన వేదికపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా సభకు వచ్చిన కార్యకర్తలు జై కాంగ్రెస్..జై ప్రియాంక నినాదాలతో హోరెత్తించారు. ఆమె తన ప్రసంగంతో కేడర్‌ను ఉత్తేజపరిచారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఐదు అంశాలు ప్రధానంగా రూపొందించిన హైదరాబాద్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కుడు పోచంపల్లి చేనేత కార్మికులు నేసిన చీరను ప్రియాంకకు బహూకరించారు.

ఆకట్టుకున్న గద్దర్ ఆటాపాట

ప్రజా యుద్ధనౌక గద్దర్ మళ్లీ కాలికి గజ్జెకట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆయన ఆటాపాటకు కొంత దూరంగా ఉన్నారు. తాజాగా ప్రియాంక సభలో కాలికి గజ్జెకట్టి 'అమ్మా తెలంగాణమా..ఆకలి కేకల గానమా' అంటూ మరోసారి తన గళాన్ని వినిపించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'బంగారు తెలంగాణ రాలే తమ్మీ.. మనం కన్న కలలు నెరవేరలే తమ్మీ' అంటూ రమేష్ నేతృత్వంలోని కళా బృందం ఆలపించిన గానం నిరుద్యోగ యువతను విశేషంగా ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే నిరుద్యోగ సంఘర్షణ సభకు వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు భారీగా తరలిరావడంతో సరూర్‌నగర్ స్టేడియం పరిసరాలు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయాయి. ప్రధాన రహదారి సహా కాలనీ రోడ్లు వాహనాలతో నిండిపోయాయి. సాధారణ ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఎందుకీ వివక్ష?

కేసీఆర్ ఉద్యోగం ఊడగొడితే.. తెలంగాణలో లక్ష మంది నిరుద్యోగులకు ఉద్యో గాలు దక్కుతాయి. యూనివర్సిటీ విద్యార్థులు, నిరుద్యోగుల విషయంలో సీఎం వివక్ష చూపుతున్నారు. నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టి.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఉద్యోగాలు కట్టబెడుతున్నారు.

– మానవతారాయ్, ఓయూ జేఏసీ

నిరుద్యోగులకు మొండిచేయి

నిరుద్యోగులను సీఎం కేసీఆర్ రెండుసార్లు మోసం చేశారు. ఎన్నికల్లో ఓటమి పాలైన కుమార్తె కవితకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు కానీ.. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారు.

– బల్మూరి వెంకట్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు

స్థానికులకు రిజర్వేషన్లు కల్పిస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు సంస్థల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా బిల్లు తెస్తాం. పరిశ్రమల పేరుతో భూములు కోల్పోయిన వారి పిల్లలకు ఉపాధి అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకుంటాం.వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకివచ్చి తీరుతుంది.

– చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బోనమెత్తిన గంగారం

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని గంగారంలో బీరప్ప జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజలో కురుమ సంఘం రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పోతురాజుల విన్యాసం

తట్టెపల్లి దీక్ష భగ్నం



మండల సాధన కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

- 25మంది అరెస్ట్, విడుదల
- అనుమతి లేకుండా దీక్ష చేస్తే చర్యలు: సీఐ రాంబాబు

పెద్దేముల్: తట్టెపల్లి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ప్రజలు 32రోజులుగా చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. మండల హోదా కోసం తట్టెపల్లి ప్రజలు తాండూరు – జహీరాబాద్ ప్రధాన రహదారి పక్కన టెంటు వేసుకొని రిలే నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం దీక్ష శిబిరం వద్దకు మండల సాధన కమిటీ సభ్యులు, ప్రజలు, నాయకులు రాగానే తాండూరు రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐలు అన్వేష్‌రెడ్డి, అబ్దుల్ రవూఫ్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దీక్షకు అనుమతులు చూపాలని మండల సాధన కమిటీ సభ్యులు, ఎంపీటీసీ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, పీఏసీఎస్ మాజీ డైరక్టర్ ప్రభు కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు ఏసప్పను అడిగారు. అనుమతి లేదని చెప్పడంతో వారిని అరెస్టు చేసి పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో నిరసనకారులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పీఎస్‌కు చేరుకున్నారు. పోలీసులతో చర్చలు జరపడంతో వారిని వదలిపెట్టారు. అనుమతి లేకుండా దీక్షలు చేయరాదని సీఐ రాంబాబు సూచించారు.

అరెస్టులతో దీక్ష ఆగదు

అరెస్టులతో దీక్ష ఆగదని మండల సాధన కమిటీ స్పష్టం చేసింది. ప్రభుత్వం తట్టెపల్లి కేంద్రంగా కొత్త మండలాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొంత మంది నాయకుల వల్లె మండల ఏర్పాటు ఆగిపోతోందని ఆరోపించారు.

ధాన్యం సేకరణ ప్రారంభం కావాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రైతు స్థానంలో ఉండి, వారి సాధక బాధకాలు అర్థం చేసుకొని పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం వరి ధాన్యం సేకరణ, మన ఊరు – మన బడి తోపాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గుర్తించిన 127 కేంద్రాల్లో రెండు రోజుల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడం తోపాటు కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అభివృద్ధి పనులను ఎంపీడీవోలు, డీఈలు, ఈఈలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. జిల్లాలోని సర్పంచులతో మాట్లాడి పారిశుధ్య పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులన్నీ ఈ నెలలోనే పూర్తి చేయాలన్నారు. వర్షం పడే విషయాన్ని ముందుగా తెలుసుకునేందుకు రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ యాప్ ద్వారా వారం రోజుల ముందుగానే వర్ష సూచనను రైతులకు తెలియజేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజావాణికి 226 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 226 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు.

విద్యార్థుల ఎంపిక

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులను డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. జిల్లా నుంచి 43 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా డ్రా పద్ధతిలో ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీపీఆర్‌ఓ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇదేం సేకరణ..!

- లేవీ బియ్యం సేకరణలో తీవ్ర జాప్యం
- గత ఏడాది రబీ బియ్యం 37శాతం మిల్లర్ల వద్దే..
- గత ఖరీఫ్‌కు సంబంధించి వచ్చింది 5శాతమే
- ప్రస్తుత ధాన్యం ఎక్కడ నిల్వ చేయాలో తెలియని పరిస్థితి
- మిల్లర్ల మాయాజాలం, వారికే కొమ్ముకాస్తున్న అధికారులు



వికారాబాద్: లేవీ (కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు సరఫరా చేసి బియ్యం రూపంలో తిరిగి తీసుకోవడం) సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సీఎంఆర్‌లో భాగంగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తూ వస్తున్నారు. అయితే వారు సకాలంలో లేవీ బియ్యం ఇవ్వకపోడంతో ధాన్యం సేకరణకు అడ్డంకిగా మారుతోంది. దీంతో రైతులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. గత రబీలో ఇవ్వాల్సిన లేవీ బియ్యం ఇప్పటి వరకు 63శాతం మాత్రమే పౌరసరఫరాల శాఖకు అందాయి. ఇక గత ఖరీఫ్‌కు సంబంధించి కేవలం ఐదు శాతం మాత్రమే వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే పౌరసరఫరాల శాఖ అధికారుల తీరు ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతుంది.

వచ్చింది ఐదు శాతమే..

లేవీ సేకరణలో అధికారులు ఎంతలా వెనుకబడి పోయారో ఈ గణాంకాలు చూస్తే అర్థం అవుతుంది. 2021– 22 రబీ సీజన్‌లో మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో ఇప్పటి వరకు 63శాతం మాత్రమే లేవీ రూపంలో పౌరసరఫరాల శాఖకు అందజేశారు. ఆ సీజన్‌లో కొనుగోలు కేంద్రాల ద్వారా 82,808 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ ధాన్యానికి మిల్లర్లకు కేటాయించారు. వారు ధాన్యాన్ని మిల్లులో ఆడించి 55,672 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇవ్వాల్సి ఉంది.అయితే సీజన్ ముగిసి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు 34,813 మెట్రిక్ టన్నుల బియాన్ని మాత్రమే సివిల్ సప్లై అధికారులకు అందజేశారు. ఇంకా 20,858 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల వద్దే ఉంది.ఇక గత ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యంలో కేవలం ఐదు శాతం బియ్యాన్నే సివిల్ సప్లై అధికారులకు అందజేశారు.గత ఖరీఫ్‌లో జిల్లాలో మొత్తం 125 కొనుగోలు కేంద్రాల ద్వారా 94,985మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు.ఈ ధాన్యాన్ని జిల్లాలోని 64 బాయిల్డ్, రా రైస్ మిల్లులకు కేటా యించారు. ఆ మిల్లుల నుంచి 63,640 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం పౌరసరఫరాల శాఖకు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 5 శాతం అంటే 3,045 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అందజేశారు. ఇంకా 60,595 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల వద్దే ఉంది.

మిల్లర్లతో అధికారుల కుమ్మక్కు

రైస్ మిల్లర్లతో సివిల్ సప్లై అధికారులు కుమ్మక్కు కావడం వల్లే వారి నుంచి సీఎంఆర్ రైస్ సేకరణ సరిగ్గా జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఓ పక్క గడువులోగా మిల్లర్ల నుంచి లేవీ రైస్ సేకరించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రస్తుత సీజన్‌లో ధాన్యం సేకరణకు ఇబ్బందిగా మారింది. మిల్లులు ఖాళీగా లేకపోవడంతో సేకరించిన ధాన్యం పక్క జిల్లాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద స్థలం లేక పోవడంతో రైతులను నేరుగా మిల్లర్ల వద్దకు పంపి అక్కడే విక్రయించే ఏర్పాట్లు చేశారు. ఇదే అదనుగా భావించిన మిల్లర్లు రైతుల వద్ద క్వింటాలుకు ఆరు నుంచి 10 కిలోల ధాన్యాన్ని తరుగు రూపంలో కోత విధించారు. ఈ విషయాన్ని అప్పట్లో సివిల్ సప్లయ్ డీఎం విమలకు రైతులు, రైతు సంఘాల నేతలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రైస్ మిల్లుల వద్ద ఆందోళనలు చేశారు. ఇంత జరిగినా మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సేకరణ వేగవంతం చేస్తాం



మిల్లర్ల నుంచి సీఎంఆర్ రైస్ సేకరణలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవం. మిల్లర్లతో మాట్లాడి లేవీ సేకరణ వేగవంతం చేస్తాం. ఇతర జిల్లాలతో పోలిస్తే లేవీ సేకరణలో మనం కాస్త ముందున్నాం. మిల్లర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మనం సేకరించే ధాన్యంలో 50శాతం వరకు ఇక్కడి మిల్లుల్లో నిల్వ చేసేందుకు అవకాశం ఉంది. మిగతా ధాన్యాన్ని ఇతర జిల్లాలకు పంపేందుకు ప్రభుత్వ అనుమతి కోసం లేఖ రాస్తాం.

– విమల, సివిల్ సప్లయ్ డీఎం, వికారాబాద్

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో ఒకరి అస్వస్థత

యాలాల: తేనెటీగల దాడిలో ఒకరు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పీఏసీఎస్ యాలాల డైరెక్టర్ అన్నారం శ్రీహరి తన పొలంలో వరి కోత నిర్వహించేందుకు హార్వేస్టర్ కోసం గడ్డం సత్యప్ప పొలం వద్దకు వెళ్లారు. అదే సమయంలో చెట్లపై నుంచి తేనెటీగలు ఒక్కసారిగా అక్కడ ఉన్న వారిపై దాడికి దిగాయి. కొందరు పారిపో గా.. అక్కడే ఉన్న శ్రీహరిపై దాడి చేశాయి. ముఖంపై కుట్టడంతో తీవ్రంగా గాయపడి అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికు లు శ్రీహరిని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కోలుకుంటున్నారు.

అక్రమకట్టడాన్ని అడ్డుకోవాలి

దౌల్తాబాద్: బిచ్చాల గ్రామం గ్రామకంఠం భూమిలో అక్రమంగా ఓ వ్యక్తి ఇల్లు నిర్మించుకుంటున్నారని, దానిని నిలిపివేసి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ భగవంతు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీఓ రవీందర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామకంఠం భూమి అని రెవెన్యూ అధికారులు సర్వే చేసి చెప్పారని, ఇందుకు గ్రామపంచాయతీ తీర్మానం కూడా ఉందన్నారు. కొంత కాలంగా అధికారులకు ఫిర్యాదు చేస్తే అప్పట్లో నిర్మాణం నిలిపివేశారని, ఇప్పుడు పంచాయతీ కార్యదర్శి సమ్మెలో ఉండడంతో తిరిగి అక్రమకట్టడం మొదలు పెట్టినట్లు పేర్కొన్నారు. కావున వెంటనే అధికారులు చర్యలు తీసుకుని అక్రమకట్టడాన్ని అడ్డుకొని, తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

పాము కాటుకు చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

కొడంగల్: రావులపల్లి గ్రామంలో కాశప్ప కూతురు దానపురం (3) పాము కాటుకు గురై చనిపోయింది. చిన్నారి బాబాయి బుడగ జంగం శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు.

వ్యక్తి రిమాండ్

పూడూరు: అభంశుభం తెలియని చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చన్గోముల్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండల పరిధిలోని మంచన్‌పల్లి గ్రా మానికి చెందిన పద్మారం రాజు వరుసకు కూ తురైన 5వ తరగతి చదువుతున్న చిన్నారికి మా మిడికాయల ఆశ చూపి పొలం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో భయపడిన బాలిక గట్టిగా అరిచింది. దీంతో బయపడిన రాజు బాలికను బైక్‌పై ఎక్కించుకుని జరిగిన విషయం ఎవరికీ చెప్పవద్దని ఇంటివద్ద వదిలిపెట్టాడు. దీంతో బాలిక జరిగిన సంఘటన కుటుంబీకులకు తెలపడంతో సోమవారం బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితునిపై పోక్సోచట్టం ప్రకారం కేసు నమోదు, చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


మృతుడు శ్యాం(ఫైల్)

యాలాల: ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెపోటుతో ఓ కూలీ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జుంటుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్నె శ్యాం(27)ఎప్పటిలాగే గ్రామ శివారు చెరువులో పూడికతీత పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా గుండెపోటుకు గురై వాంతులు చేసుకున్నాడు. తోటి కూలీలు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే శ్యాం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పనులు చేస్తుండగా గుండెపోటు రావడంతో శ్యాం మృతి చెందాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

తలకొండపల్లి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మెదక్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అల్వాల్ రాఘవేందర్‌గౌడ్ సోమవారం ఆవును మేతకు వదిలాడు. ఓ విద్యుత్ స్తంభం వద్ద విద్యుత్‌వైర్ తెగిపడింది. ఆవు తీగపై కాలు వేడయంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

గదిలో బంధించి.. బెల్టుతో కొట్టి

- అప్పు చెల్లించాలంటూ కార్మికుడిపై యజమాని దాష్టీకం
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు, కేసు నమోదు


రాణా వద్ద నిరసన తెలుపుతున్న వడ్డెర సంఘం ప్రతినిధులు


గాయాలను చూపిస్తున్న కార్మికుడు

తాండూరు రూరల్: తీసుకున్న అప్పు చెల్లించడం లేదని ఓ కార్మికుడిని యజమాని గదిలో బంధించి బెల్టుతో కొట్టిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. తాండూరు మండలం సిరిగిరిపేట్‌కు చెందిన వడ్డెరపాని నర్సింహులు.. గౌతపూర్ శివారులోని సులేమాన్ అనే పాలిషింగ్ యూనిట్ యజమాని వద్ద ఏడాది క్రితం పనిలో చేరాడు. ఇందుకు గాను యజమాని కార్మికుడు నర్సింహులుకు రూ.2.50 లక్షలు అడ్వాన్స్ కింద ఇచ్చాడు. నర్సింహులుతో పాటు అతని భార్య కూడా అక్కడే పని చేస్తోంది. కొన్ని నెలల క్రితం నర్సింహులు పని మానేయడంతో తనకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇవ్వాలని సలేమాన్ ఒత్తిడి తెచ్చారు. దీంతో 15 రోజుల క్రితం సదాశివపేట్‌లోని తన బంధువుల వద్దకు నర్సింహులు వెళ్లాడు. విషయం తెలుసుకున్న సులేమాన్ అతని అనుచరులు రాజు, యాసిన్‌లు నర్సింహులును తీసుకొచ్చి పాలిషింగ్ యూనిట్‌లోని ఓ గదిలో బంధించారు. తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని దాడి చేసి, చిత్రహింసలు పెట్టారు. దెబ్బలు తాళలేక బాధితుడు వడ్డెర సంఘం ప్రతినిధులతో కలిసి సోమవారం రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిలను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం యజమాని సులేమాన్, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆందోళన చేస్తాం..

వడ్డెర కులస్తుడైన కార్మికుడు నర్సింహులను బెల్టుతో కొట్టి చిత్రహింసలు పెట్టిన యజమాని సులేమాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నియోజకవర్గ అధ్యక్షుడు రాములు, నాయకులు పండరి, వెంకటేశ్ డిమాండ్ చేశారు. వడ్డెరులను వేధిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

యాజమాన్యమే బాధ్యత వహించాలి

- కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి
- పరిశ్రమ ఎదుట అఖిలపక్ష నాయకుల ధర్నా

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో కార్మికుడు పాశం సురేశ్ మృతికి వావిన్ పరిశ్రమ యాజమాన్యమే బాధ్యత వహించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేపట్టారు. సురేశ్‌ను హెచ్‌ఆర్ మేనేజర్ రవికుమార్ సెలవులు ఇవ్వకుండా.. కక్షతో వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కార్మికుడి మృతితో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందన్నారు. వారికి న్యాయం చేయడానికి వీలుగా పరిశ్రమ నిర్వాహకులు మృతుడి కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం, రూ.కోటి పరిహారం చెల్లించాలని నినాదాలు చేశారు. న్యాయం చేసేంత వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేది లేదని ఆందోళనకారులు భీష్మించారు. పోలీసులు జోక్యం చేసుకొని యాజమాన్యంతో చర్చలు జరిపే విధంగా చొరవ చూపుతామని సముదాయించడంతో వారు ధర్నా విరమించారు.నాయకులు దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, డోలీ రవీందర్, వస్పుల మహేందర్, నర్సింహ్మగౌడ్, సాయిబాబా, నాగరాజుచారి,భేరి శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


గేటు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రూ. 12.49కోట్లకు 2కోట్లే వసూలు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

- 50శాతం బకాయిలు వసూలు చేయకుంటే డిఫాల్టర్‌గా ప్రకటిస్తారు
- నాలుగు సార్లు నోటీసులు ఇచ్చాకే రైతుల ఆస్తులు జప్తు
- జిల్లా సహకార సంఘం అధికారి శంకరయ్య

ధారూరు: నిబంధనల మేరకే ధారూరు పీఏసీఎస్‌లో రైతుల నుంచి రుణాలు వసూలు చేస్తున్నామని జిల్లా సహకార సంఘం అధికారి శంకరయ్య, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. రుణాలు చెల్లించలేదని రైతుల ఆస్తుల జప్తు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు వారు స్పందించారు. సోమవారం సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ధారూరు పీఏసీఎస్ లోని 400 మంది రైతులకు రూ. 5 కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇచ్చామని తెలిపారు. జూన్ నెలాఖరుకు రూ. 12.49కోట్ల బకాయిలు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ. 2కోట్లు మాత్రమే చెల్లించారని తెలిపారు. రుణాలు చెల్లించని రైతులకు నాలుగు సార్లు నోటీసులు ఇచ్చామని, వారి నుంచి స్పందన లేకపోవడంతో విధిలేక ఆస్తులను జప్తు చేయాల్సి వచ్చిందన్నారు. సెక్షన్ 71 కింద నోటీసులు ఇచ్చిన తర్వాతే డీజీఎం, ఏజీఎం, డీఆర్‌ఓ స్థాయి అధికారుల బృందం జప్తు చేసిందని పేర్కొన్నారు. రుణాలు చెల్లించిన వెంటనే రైతుల ట్రాక్టర్లను తిరిగి ఇచ్చేస్తామన్నారు. 50శాతం బకాయిలు వసూలు చేయకుంటే సొసైటీని డిఫాల్టర్‌గా ప్రకటిస్తారని తెలిపారు. రుణాలు చెల్లించవద్దని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇకపై కలెక్టర్‌కు చెప్పిన తరువాతే రుణాల రికవరీ చేస్తామని వారు వివరించారు. వసూళ్ల ప్రక్రియ ఆగదని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం సీఈఓ నర్సింహులు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

మందు.. పసందు



- ధరలు తగ్గడంతో మద్యం ప్రియుల హర్షం
- జిల్లాలో 59 వైన్స్ షాపులు
- ఏటా రూ. 424.80 కోట్ల మేర వ్యాపారం

తాండూరు: లిక్కర్ ధరలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మందుబాబులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల్లో అమ్మకాలు పడిపోవడంతో ధరలు తగ్గించినట్లు తెలుస్తోంది. లిక్కర్ ఫుల్ బాటిల్‌పై రూ. 40, హాఫ్ బాటిల్‌పై రూ. 20 తగ్గించింది. జిల్లాలో మొత్తం 59 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో షాపు నిర్వహణకు ప్రభుత్వం లైసెన్సు ఫీజు రూపంలో ప్రతి ఏటా రూ. 1.10కోట్ల వరకు వసూలు చేస్తోంది. నిత్యం ఒక్కో షాపులో రూ. 2లక్షల నుంచి 2.50 లక్షల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ప్రతి నెలా జిల్లాలో రూ. 35.54కోట్ల వ్యాపారం జరుగుతోంది. అయితే ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా మద్యం బ్రాండ్ల (ఐఎంఎల్) అమ్మకాలు పడిపోయాయి. జిల్లాలో లిక్కర్ బాటిల్ ధర అధికంగా ఉండడంతో ఇదే బ్రాండ్ కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో తక్కువగా ఉండడంతో మద్యం ప్రియులు అక్కడికి వెళ్లి లిక్కర్‌ను తెచ్చుకుంటున్నారు. ఈ విషయం గుర్తించిన ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో లిక్కర్ ధరలు తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తగ్గించిన ధరలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే బీర్ ధరలు తగ్గక పోవడం మందుబాబుల్లో కొంత నిరాశ కనిపించింది.

తగ్గిన ధరల ప్రకారమే విక్రయించాలి



మద్యం ధరలు తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్దేశించిన ధరల ప్రకారమే మద్యం విక్రయించాలి. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– అనంతయ్య, ఎక్సైజ్ సీఐ, తాండూరు

గుడుంబా విక్రేతలకు బైండోవర్

ఒకరికి రూ.లక్ష జరిమానా

మహేశ్వరం: నాటు సారా తయారీ చేసి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను సోమవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని తహసీల్దార్ మహ్మద్‌అలీ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి, ఎస్‌ఐ హన్మంత్, ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమ్మ తండాలో నాటుసారా తయారీ చేసి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. గతంలో పట్టుబడిన నెహ్రూ నాయక్ బైండోవర్‌ను ఉల్లంఘించినందుకుగాను కేసు నమోదు చేశామన్నారు. ఇందుకు ఆయనకు జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఎక్సైజ్ పోలీసులు నోటీసులిచ్చారు. జరిమానా చెల్లించకుంటే జైలుకు పంపుతామని ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి తెలిపారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌బాబు


మార్కెట్ అధికారులతో చర్చిస్తున్న బీజేపీ నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌కు మామిడిని తీసుకువచ్చే రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌బాబు, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మామిడి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు బాటసింగారం మార్కెట్‌ను సందర్శించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల వద్ద నుంచి 11శాతం కమీషన్ వసూళ్లు చేయడాన్ని తగ్గించడంతో పాటు రవాణా సౌకర్యాలు, గిట్టుబాటు ధర చెల్లింపు తదితర సమస్యలపై మార్కెట్ అధికారులతో చర్చించామన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాపయ్యగౌడ్, ఎంపీ యాదగిరి, రమాదేవి, శ్రీనివాస్, దినేశ్, రైతులు మల్లేశ్, శివ, ఈశ్వరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మలుపు తిరిగిన భూ వివాదం

- వీర్లపల్లి శంకర్ తప్పులేదు..
- సీఐ పిలిపించి మాట్లాడుతానంటేనే ఫిర్యాదు చేశా
- ఫిర్యాదు దారుడు శ్రీనివాస్

నందిగామ: కాంగ్రెస్ నేత వీర్లపల్లి శంకర్‌తో పాటు మరో ఇద్దరిపై నమోదైన కేసు సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఫిర్యాదు దారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. భూవివాదంలో వీర్లపల్లి శంకర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తుల తప్పిదమేమీ లేదని సీఐ ఫిర్యాదు చేయమంటేనే కేసు పెట్టానని స్పష్టం చేశారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'భూ వివాదంలో ముగ్గురిపై కేసు' శీర్షికన ప్రచురితమైన వార్త స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు సోమవారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో శంకర్‌తో పాటు మరో ఇద్దరి వ్యక్తుల వద్ద భూమి కొనుగోలు చేసిన మాట వాస్తవమని, గడువులోగా తన వద్ద డబ్బులు సర్దుబాటు కాక రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్నారు. గడువుకు ముందే ఆ భూమిని వెంకమ్మగూడకు చెందిన అశోక్‌కు విక్రయించి రీ అగ్రిమెంటు చేశానని, అశోక్ సకాలంలో నాకు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. దీంతో పలుసార్లు గడువును పొడిగించినా డబ్బులు సర్దుబాటు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జూలై 20న అగ్రిమెంటును ఇరువురి అంగీకారంతో రద్దుచేసుకున్నట్లు తెలిపారు. తాను శంకర్‌తో పాటు మరో ఇద్దరికి ఇచ్చిన డబ్బులను భూమి విక్రయించిన తర్వాత ఇస్తానని శంకర్ చెప్పాడని, శంకర్ భూమి ఇప్పటికి విక్రయించకపోవడంతో డబ్బులు ఇవ్వలేదని. ఇంతలో అశోక్ డబ్బుల కోసం ఒత్తిడి తీసుకొచ్చాడని. అంతటితో ఆగని అశోక్ ఇటీవల తనపై నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. అశోక్ ఫిర్యాదు మేరకు సీఐ రామయ్య తనను పీఎస్‌కు పిలిపించడంతో విషయం చెప్పానని అన్నారు. దీంతో సీఐ వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు చేస్తే పిలిపించి మాట్లాడుతా అని చెప్పడంతో కేసు పెట్టానన్నారు. పిలిపించి మాట్లాడుతా అని చెప్పిన సీఐ వెంటనే శంకర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశాడని అన్నారు. ఈ విషయంలో వీర్లపల్లి శంకర్ తప్పులేదన్నారు.

మహిళ అదృశ్యం


సునీత (ఫైల్)

రాజేంద్రనగర్: మహిళ అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లక్ష్మిగూడకు చెందిన మహేష్, సునీత(35) భార్యాభర్తలు. ఏప్రిల్ 13న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. సునీతకు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా నేరం


ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శంషాబాద్: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతిఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ఆమె అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణాకు గల కారణాలపై ప్రజల్లో చైతన్యం మరింత పెరగాల్సిన అవసరముందన్నారు. ప్రజ్వల సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, సీనియర్ కో ఆర్డినేటర్ ఎం. సురేష్, శ్రావ్య, వినోద్ పాల్గొన్నారు.

చదువొక్కటే జీవితం కాదు..

- ఫలితాలు ఎలా ఉన్నా సర్దుకుపోవాలి
- ఉత్తీర్ణతపై మరొకరితో పోల్చి విద్యార్థులను టెన్షన్ పెట్టొద్దు
- నేడు ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదల
- మరో రెండు రోజుల్లో పదో తరగతి రిజల్ట్


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు (ఫైల్)

తాండూరు: తమ కొడుకు.. కూతురు.. ఉన్నత చదువులు చదవాలి. అత్యున్నత శిఖరాలకు ఎదగాలని తల్లిదండ్రులు ఆశ పడటంలో తప్పులేదు. అయితే పరీక్షల్లో ఫెయిల్ అయితే పక్కోడు చూడు ఎలా చదవి మార్కులు తెచ్చుకున్నాడో.. అంటూ తమ పిల్లల మనసు నొప్పించేలా మాట్లాడటం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. ఒకరితో పోలిస్తే విద్యార్థులు అసలు సహించరు. మరోవైపు అది కూడా పరీక్షల ఫలితాల సమయంలో ఇబ్బందులు పెడితే మనస్తాపానికి లోనై అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు ఏటా పెరిగిపోతున్నాయి. గతంలో చదువు విషయంలో పోటీ ఉండేది కాదు. మా వాడు పాసైతే అదే పది వేలు అనే ధోరణి ఉండేది. ప్రస్తుతం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. నేటితరం చదువుల్లో పోటీతత్వం పెరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలు ర్యాంకు సాధించాలని ఒత్తిడి పెంచుతున్నారు. ఈ విధానం వల్లే విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. జీవితంలో చదువు అనేది ఒక భాగం మాత్రమే అనేది విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. నేడు ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు వెలువడుతున్నాయి. మరో రెండు రోజుల్లో పదో తరగతి ఫలితాలు రానున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మానసిక వైద్య నిపుణులు అంటున్నారు.

నేడు ఫలితాలు

ఇంటర్ బోర్డు అధికారులు మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ఫలితాలు విడుదల చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. అయితే కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో విద్యార్థులు పాఠశాలకు, కళాశాలకు వెళ్లకుండానే పదిలో పాస్ అయ్యారు. దీంతో ఇంటర్‌లో చేరాక బోధన విషయంలో తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. మరోవైపు తల్లిదండ్రులు తమ పిల్లలను ర్యాంకు సాధించాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

అపజయం విజయానికి నాంది

అపజయం అనేది విజయానికి నాంది అనేలా విద్యార్థులు ముందుకు సాగాలి. గతంలో ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్షలు రాసి ఉన్నత స్థాయిలో రాణిస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి. తొందరపాటు చర్యలు తీసుకొని ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దు.

బాధపడొద్దు



మనిషికి జీవితంలో గెలుపోటములు సహజం. అయితే గెలిస్తే సంబురపడటం, ఓడితే బాధపడటం మామూలే.. కానీ పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని ఆత్మహత్యలు చేసుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. పరీక్ష ఫలితాలు జీవితాన్ని నిర్దేశించవు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే పరాజయాలను సైతం స్వీకరించాలి. క్రీడా పోటీల్లో క్రీడాకారులు గెలుపు, ఓటములు చెందుతారు. ఎన్నోసార్లు ఓడిపోయిన తర్వాతే గెలుపు చూస్తారు. విద్యార్థులు క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలి.

– శేఖర్‌గౌడ్, డీఎస్పీ, తాండూరు

తల్లిదండ్రుల కంటే ఫలితం ఎక్కువ కాదు



ఇంటర్ పరీక్షల రిజల్ట్ ఎలా వచ్చినా ఒత్తిడికి లోను కాను. పరీక్షల్లో పాసైనా.. ఫెయిల్ అయినా స్పోర్టివ్‌గా తీసుకుంటాను. నాకు చదువు ఒక్కటే జీవితం కాదు. అంతకు మించి నా కుటుంబ సభ్యులు నాకు తోడున్నారు. తల్లిదండ్రుల ప్రేమ ముందు పరీక్ష ఫలితాలు అంత గొప్పవికావు.

– సుప్రియ, ఇంటర్ విద్యార్థి, తాండూరు

రాక్‌సాండ్ క్వారీలను వడ్డెర్లకు కేటాయించాలి

తాండూరు టౌన్: రాక్‌సాండ్ క్వారీలను వడ్డెర్లకు కేటాయించాలని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుంజి సంతోష్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి శాంతుకుమార్ కోరారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ పాండు రంగారావుకు సోమవారం హైదరాబాద్‌లో వినితి పత్రం అందజేశారు. వడ్డెర్ల హక్కుల సాధనలో భాగంగా గతంలో క్వారీలను వడ్డెర కులస్తులకు కేటాయిస్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని, ప్రభుత్వం వెంటనే వాటిని కేటాయించి వారి అభ్యున్నతికి దోహదపడాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు.


టీఎస్‌ఎండీసీ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌పీఎస్ ప్రతినిధులు